



# ఎస్.ఎమ్.ఎస్.సామ్రాజ్ఞి


## దానం ఉమాదేవి


"మీ చెట్టు ఆకులు మా ఇంట్లో పడుతున్నాయి. వచ్చి శుభ్రం చేయండి" పక్కింటి మనోరమతో ఘాటుగానే చెప్పింది మీనాక్షి.

"నేనేమైనా తెచ్చి మీ యింట్లో పోశానా! గాలికి ఆకులు రాలితే నేనేం చేయను" ధీటుగా జవాబిచ్చింది మనోరమ.

"ఇతరుల ఇళ్ళలో రాలకుండా చూసుకోవాల్సిన బాధ్యత నీదే"

"మా చెట్టు కొమ్మలు నీ యింటి మీద వాలటం వల్ల చల్లటి నీడనసుభవిస్తున్నప్పుడు ఆకులు ఊడ్చి శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత కూడా నీదే"

"మా పనమ్మాయి నెలదాకా రానని చెప్పింది. ఈ నెల రోజులు ఆకులు శుభ్రం చేసే బాధ్యత నీదే"

వాదన జరుగుతూనే ఉంది. ఇరుగుపొరుగు వాళ్ళందరూ ఒక చోటికి చేరి వీరి తగాదాను ఎంజాయ్ చేస్తున్నారు. గాలికి రాలే ఆకుల దగ్గర గంటకు పైగా వాదన జరిగింది.

"మీకు నా వాదన సరైనదనిపిస్తే యస్ అని ఈ నెంబర్‌కి ఎస్.ఎమ్. ఎస్. చేయండి"

తమ తగాదాను చూస్తున్న ఇరుగు పొరుగుకు నెంబర్ చెప్పి ఠీవిగా ఇంట్లోకి నడిచింది మీనాక్షి.

"పిచ్చి ముదిరింది"

నవ్వుకుంటూ తమ ఇళ్ళలోకి వెళ్ళిపోయారు మిగతావాళ్ళు.

మీనాక్షికి టి.వి. పిచ్చి ఎక్కువ. ప్రతీదీ చూడటం, యస్.నో తెలియ చేస్తూ ఎస్.ఎం.ఎస్.లు పంపించటం హాబీ. హాబీ దశ కూడా దాటి వ్యసనంగా మారిపోయింది.

టి.వి. చూడటం ఆ ఇంటివాళ్ళు పడుకున్నా మీనాక్షి కదలదు.

పైగా సుబ్బారావు పిల్లలు వచ్చేటప్పటికి మీనాక్షి ఎవరింటికో టి.వి.కోసం వెళ్ళేది. వంట, పిల్లల హోంవర్క్ వగైరా సుబ్బారావే చూసుకోవాల్సి వచ్చేది. కాలనీలోని ఇళ్ళన్నీ గాలిస్తే తప్ప ఏ ఇంట్లో ఉన్నదో తెలిసేది కాదు. ఈ బాధలు పడలేక తిరిగి కేబుల్ కనెక్షన్ పెట్టించాడు సుబ్బారావు. మీనాక్షి ఇంట్లో ఉంటే వంట బాధ తప్పుతుందని అతడి ఆలోచన.

అనునయంగా చెబితే ఫలితముంటదేమోనన్న ఆశతో ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాడు సుబ్బారావు. ఒకరోజు మీనాక్షి అభిమాన హీరో సినిమాకు తీసుకెళ్ళి నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. టి.వి.పిచ్చి తగ్గించుకుంటే మంచిదని, యస్.యమ్.యస్‌ల వల్ల డబ్బు వృథా అని చెప్పాడో లేదో మీనాక్షి ముక్కు చీదుతూ శోకాలు మొదలుపెట్టింది.

"వంకాయ కూర చేద్దామనుకుంటున్నాను. మీకు ఇష్టమో కాదో ఎస్.ఎమ్.ఎస్ చేయండి"

భర్తను పిల్లలను చూస్తూ చెప్పి వంటింట్లోకి నడిచింది మీనాక్షి.

తలపట్టుకున్నాడు మీనాక్షి భర్త సుబ్బారావు. సెల్ కొనిచ్చే దాకా ఒకటే గొడవ. ఎస్.ఎమ్.ఎస్‌లు పంపించటానికే సగం జీతం సరిపోతున్నది. టి.వి. పిచ్చి మాన్పించడానికి ఒకసారి కేబుల్ కనెక్షన్ తీసి వేయించాడు.

ఇంట్లో భూకంపమే వచ్చింది. తనకున్న ఏకైక వినోదం అదేనని దాన్ని చూడకుండా చేసి తనను బాధపెడ్తున్నారని. మీ అభిప్రాయాలను యస్.ఎమ్.ఎస్‌ల ద్వారా తెలియచేయమని బంధుమిత్రులకు, ఇరుగు పొరుగుకు ఫోన్ చేసి మరీ చెప్పింది. పూర్తి జీతం కూడా ఆ నెల ఫోన్లకు సరిపోలేదు.

సుబ్బారావు బయటకు అడుగు పెడితే కనిపించిన ప్రతి వాళ్ళూ ఒకటే మాట. కేబుల్ కనెక్షన్ పెట్టించమని, ఇరుగు పొరుగు వాళ్ళైతే పెట్టించే దాకా ఊరుకోలేదు. కారణం మీనాక్షి మీద అభిమానం కాదు. అర్ధరాత్రి దాటేదాకా వాళ్ళ ఇళ్ళలో

హాల్లోని మిగతా ప్రేక్షకులు, సుబ్బారావు పరాయి స్త్రీని టీజ్ చేస్తున్నాడని భావించి దేహశుద్ధి చేయటానికి రాగా సుబ్బారావు అతికష్టమ్మీద మీనాక్షి తన భార్యేనని నచ్చచెప్పగలిగాడు.

అప్పటి నుండి భార్యను మార్చే ప్రయత్నం చేయలేదు.

"టీ"

భార్య పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు సుబ్బారావు.

* * *

సుబ్బారావు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లంతా హడావుడిగా ఉన్నది. టి.వి.కెమెరా వాళ్ళూ ఇరుగు పొరుగు అందరూ గుమిగూడి ఉన్నారు. సుబ్బారావుకు ఏం జరిగిందో అర్థం కాలేదు. ఇంట్లో వాళ్ళకు ఏదైనా ప్రమాదం జరిగితే టి.వి.వాళ్ళు న్యూస్‌కవరేజ్‌కి వచ్చారా...?

అదురుతున్న గుండెను అదిమిపెట్టుకుంటూ లోపలికి నడిచిన సుబ్బారావుకు లోపలి పరిస్థితి అందుకు భిన్నంగా కన్పించింది. మీనాక్షి నవ్వుతూ కుర్చీలో కూర్చుని ఉంటే ఒక టి.వి.యాంకర్ మీనాక్షి తలమీద ఒక చిన్న కిరీటం పెట్టి ఒక షీల్డ్ చేతికిచ్చింది.

"యస్.యమ్.యస్. సామ్రాజ్ఞికి జై"

యాంకరిచ్చిన బిరుదుతో గర్వంగా ఫీలైంది

మీనాక్షి. ఆ టి.వి. ఛానల్ వాళ్ళకు అత్యధిక యస్.యమ్.యస్‌లు పంపించినందుకుగాను సదరు ఛానల్ మీనాక్షికి యస్.యమ్.యస్. సామ్రాజ్ఞి బిరుదునిచ్చి సత్కరించింది.

"మావారు" లోపలికి వచ్చిన సుబ్బారావును టి.వి.వాళ్ళకు పరిచయం చేసింది మీనాక్షి.

"మీ ఆవిడ ఈ బిరుదు దక్కించుకున్నందుకు మీరెలా ఫీలవుతున్నారు?"

మైక్ సుబ్బారావు ముందు పెట్టి వయ్యారంగా అడిగింది యాంకర్.

కెమెరా సుబ్బారావు వైపు తిరిగింది.

మీనాక్షి ఇప్పుడు ఇంకా రెట్టించిన ఉత్సాహంతో యస్.యమ్.యస్‌లు పంపిస్తుందేమో. ఇన్నాళ్ళూ సగం జీతంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఇప్పటి నుండి ఆ సగం కూడా మిగలదేమో. సుబ్బారావు ఆలోచనల్లో ఉండగానే యాంకరు మళ్ళీ అడిగింది.

"మీరెలా ఫీలవుతున్నారు"

"చాలా ఆనందంగా వుంది" ఏడ్పు మొహంతో చెప్పాడు సుబ్బారావు.

"ఆనందంతో సుబ్బారావుగారు తబ్బిబ్బు అవుతున్నారు" యాంకరు వెకిలిగా నవ్వింది. టి.వి.ఛానల్ వాళ్ళు వెళ్ళిపోయాక మీనాక్షి బంధుమిత్రులందరికీ తన సన్మాన కార్యక్రమం టి.వి.లో ఏరోజు ప్రసారం చేస్తారో యస్.యమ్.యస్‌ల ద్వారా తెలియచేసింది.

సుబ్బారావుకు తల దేనికైనా బాదుకోవాలనిపించింది.

కాలం గడిచేకొద్దీ మీనాక్షి యస్.యమ్.యస్‌ల పిచ్చి పెరిగిందే కానీ తగ్గలేదు. ప్రతి టి.వి.ఛానల్ వాళ్ళు ఏదో ఒక బిరుదును మీనాక్షికి ప్రదానం చేస్తూనే ఉన్నారు. ఒక టి.వి. ఛానల్ వాళ్ళైతే ఇంటర్వ్యూ కూడా తీసుకున్నారు. మీనాక్షి రెట్టించిన ఉత్సాహంతో యస్.యమ్.యస్‌లు పంపిస్తూనే వుంది.

పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యాక కొడుక్కి పెళ్ళిచూపులకు వెళ్ళింది మీనాక్షి. పిల్ల నచ్చిన విషయం యస్.యమ్.యస్ ద్వారానే తెలియచేసింది. కట్న కానుకలు మాట్లాడేటప్పుడు ఐదు లక్షలకు తక్కువైతే ఒప్పుకోనని ఖచ్చితంగా మెసేజ్‌లో చెప్పింది.

వెంటనే పెండ్లి కూతురు సెల్ తీసుకొని టకటకా కొన్ని నెంబర్లు నొక్కింది.

"కట్నం తీసుకోవటం చట్టబద్ధమా కాదా అని పోలీస్ కమీషనర్‌గారికి యస్.యం.యస్ పంపించాను. మీ ఎస్.ఎం.ఎస్ కూడా ఆయనకి ఫార్వర్డ్ చేశాను. ఆయన ఇవ్వమంటే ఇస్తాము" పెండ్లి కూతురు ఇచ్చిన మెసేజ్ వైపు నోరుతెరుచుకుని చూస్తుండిపోయింది మీనాక్షి.

ఇన్నాళ్ళకి మీనాక్షికి ధీటైన కోడలు వచ్చింది అంటూ నవ్వుకున్నారు బంధువులు.

○

